సాక్షి నిర్మల్

శుక్రవారం । 16 । జూన్ । 2023



నేను.. ఎమ్మార్వో ఆఫీస్ నుంచి..

నేరడిగొండ తహసీల్ కార్యాలయ అటెండర్ ఓ మహిళకు అసభ్యకర ఆడియో మెసేజ్‌లు పంపాడు. దీంతో బాధితురాలి గ్రామస్తులు అతడికి దేహశుద్ధి చేశారు. 8లో▸



చేపల వేటే జీవనోపాధి 9లో▸

ప్రాణాలకు తెగించి.. చేపల వేటనే నమ్ముకొని జీవనం సాగించే మత్స్యకార కుటుంబాలు జిల్లాలో ఎనిమిది వేల వరకు ఉన్నాయి. కాలాలకు అతీతంగా నిద్ర లేచిన వెంటనే వారి పయనం గోదావరి వైపు ఉంటుంది.

వాతావరణం

గరిష్టం/కనిష్టం
41.6 /29.8

అధిక ఉష్ణోగ్రతలు కొనసాగుతాయి. ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటుంది. వడగాలులు వీస్తాయి. ఉక్కపోత కూడా ఎక్కువగా ఉంటుంది. రాత్రి కూడా వేడిగా ఉంటుంది.

న్యూస్‌రీల్

పరీక్ష కేంద్రం తనిఖీ



తనిఖీ చేస్తున్న డీఐఈవో పరశురాం

కుంటాల: స్థానిక ఆదర్శ పాఠశాలలో ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు కొనసాగుతున్నాయి. ఈ కేంద్రాన్ని డీఐఈవో పరశురాం, డెక్ మెంబర్స్ తుకారాం, రవికిరణ్ గురువారం తనిఖీ చేశారు. ఉదయం నిర్వహించిన మొదటి సంవత్సరం మ్యాథ్స్, జువాలజీ పరీక్షకు 17 మంది విద్యార్థులగాను ముగ్గురు గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం ద్వితీయ సంవత్సరం పరీక్షకు ఒక విద్యార్థికిగాను ఆ విద్యార్థి కూడా గైర్హాజరైనట్లు సూపరింటిండెంట్ శ్రీనివాస్‌ప్రసాద్ తెలిపారు.

ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి



కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న రాంబాబు

సారంగపూర్: వరిధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలని అదనపు కలెక్టర్ రాంబాబు సూచించారు. మండలంలోని జామ్, యాకర్‌పెల్లి, సారంగాపూర్, కౌట్ల(బి) గ్రామాల్లోని కొనుగోలు కేంద్రాలను గురువారం పరిశీలించారు. మరో రెండు మూడురోజుల్లో జామ్ కేంద్రంలో ధాన్యం కొనుగోళ్లు పూర్తవుతున్నాయని తెలిపారు. అక్కడి హమాలీలను యాకర్‌పెల్లి, సారంగాపూర్ తరలించి కొనుగోళ్లు వేగవంతం చేయాలని నిర్వాహకులకు సూచించారు. దీంతోపాటు కౌట్ల(బి) గ్రామంలోనూ ధాన్యం నిల్వలు అధికంగా ఉన్న నేపథ్యంలో ఇతర గ్రామాల నుంచి హమాలీలను తరలించాలన్నారు. లారీల కొరత లేకుండా ఎప్పటికప్పుడు లారీలను పంపిస్తామని తెలిపారు. మరో నాలుగైదురోజుల్లో ధాన్యం మొత్తం తరలించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. ఆయన వెంట సారంగాపూర్ తహశీల్దార్ సంతోష్‌రెడ్డి, ఎంఆర్ఐ ముంతాజ్, కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు ఉన్నారు.

నేడు అంగన్‌వాడీ యూనియన్ సభ



మాట్లాడుతున్న అంగన్‌వాడీ నాయకులు

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ మినీ స్టేడియంలో అంగన్‌వాడీ యూనియన్ బహిరంగ సభ శుక్రవారం ఉంటుందని యూనియన్ జిల్లా అధ్యక్షురాలు రాజమణి తెలిపారు. అంగన్‌వాడీ టీచర్ల సమస్యలు పరిష్కరించాలని, ఐసీడీఎస్ వ్యవస్థను బలోపేతం చేయాలని, నూతన విద్యా చట్టాన్ని రద్దుతోపాటు ఇతర సమస్యలపై చర్చించేందుకు మధ్యాహ్నం3 గంటలకు సభ నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఈ సభకు అంగన్‌వాడీలు హాజరై విజయవంతం చేయాలని కోరారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి బొమ్మెన సురేశ్, అంగన్‌వాడీ యూనియన్ జిల్లా కార్యదర్శి లలిత, జిల్లా ఉపాధ్యక్షురాలు శైలజ, విజయ పాల్గొన్నారు.

పారదర్శక ఓటరు జాబితా తయారీకి సహకరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో

నిర్మల్‌చైన్‌గేట్: ఎటువంటి తప్పులు, పొరపాట్లు లేకుండా పారదర్శక ఓటరు జాబితా తయారీకి అన్ని పార్టీలు సహకరించాలని నిర్మల్ అసెంబ్లీ నియోజకవర్గ ఓటరు జాబితా నమోదు అధికారి, ఆర్డీవో స్రవంతి కోరారు. ఓటరు జాబితా తయారీపై అన్ని పార్టీల ప్రతినిధులతో గురువారం సమావేశం నిర్వహించారు. ఎన్నికల కమిషన్ ద్వారా వచ్చిన జాబితాలో ఆరు కంటే ఎక్కువ ఓట్లు ఉన్న ఇంటిని తనిఖీ చేసి వాటిలో ఏవైనా ఇంటి నంబర్లలో మార్పులు ఉంటే సరిచేయడం జరిగిందన్నారు. క్లైమ్స్, అభ్యంతరాలు ఫారం 6, 7, 8 గురించి తెలియజేశారు. సమావేశంలో తహసీల్దార్లు, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

17న జలశక్తి అవార్డులు

కైలాస్‌నగర్: నీటి సంరక్షణ, నిర్వహణకు గాను కేంద్ర జలశక్తి మంత్రిత్వశాఖ ఇదివరకు ప్రకటించిన జాతీయ నీటి అవార్డులను అందించే తేదీలు ఖరారు చేసింది. ఉత్తమ జిల్లాల కేటగిరీలో ఆదిలాబాద్ దేశంలోమూడో స్థానంలో నిలిచింది. ఈనెల 17న ఢిల్లీలో ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌కడ్ అవార్డు ప్రదానం చేస్తారని కేంద్ర జలశక్తిశాఖ ఉత్తర్వులు జారీ చేసింది.

పోలీసుల వలయంలో ట్రిపుల్‌ఐటీ!

- ప్రధాన గేటు వద్ద పోలీసుల మోహరింపు
- లోనికి ఎవరినీ అనుమతించని వైనం
- బీజేపీ నాయకుల అడ్డగింత



బీజేపీ నాయకురాలు రమాదేవిని బలవంతంగా తరలిస్తున్న పోలీసులు



బీజేపీ నాయకుడిని తరలిస్తున్న పోలీసులు

భైంసా: ఎన్నో ఆశలతో, ఎంతో సంతోషంతో ఏడాది క్రితం బాసర వర్సిటీలో అడుగుపెట్టారు. పదో తరగతిలో వారు పడిన శ్రమ వృథా కాలేదు. చదువుల తల్లి సరస్వతీదేవి కొలువైన బాసరలోని ట్రిపుల్‌ఐటీ విద్యాక్షేత్రంలో సీటు సాధించారు. ఇక తమ బిడ్డల భవిష్యత్‌కు ఢోకా లేదని తల్లిదండ్రులు సంతోషించారు. కానీ ఏడాదికే అంతా అయిపోయింది. ఏం జరిగిందో తెలియదు.. ఒకరి తర్వాత ఒకరు అర్ధాంతరంగా తనువు చాలించారు. తాము చదువుతున్న కళాశాలలోనే జీవితాన్ని ఆపేశారు. ఈనెల 13న వడ్ల దీపిక ఉరేసుకుని ఆత్మహత్య చేసుకోగా బుధవారం అర్ధరాత్రి దాటిన తర్వాత లిఖిత భవనం పైనుంచి పడి మృతిచెందింది. వరుస ఘటనలతో కలకలం రేపిన ట్రిపుల్ ఐటీ ప్రస్తుతం పోలీసుల వలయంలో ఉంది. వర్సిటీ వద్ద భద్రతను కట్టుదిట్టం చేశారు. లిఖిత మరణం వార్త బయటకు రాగానే భారీగా బలగాలను మోహరించారు. ట్రిపుల్‌ఐటీ ప్రధాన ద్వారం వద్ద ప్రత్యేక భద్రతా సిబ్బంది బారికేడ్లు ఏర్పాటు చేశారు. కొత్తవారిని లోనికి అనుమతించలేదు. లిఖిత తల్లిదండ్రులను మాత్రం ఘటన జరిగిన బ్లాక్ వద్దకు పోలీస్ వాహనంలో తీసుకొచ్చి చూపించి తీసుకెళ్లారు. ఇక వర్సిటీలోకి మీడియాను అనుమతించడం లేదు. ఒక్కమాటలో చెప్పాలంటే ట్రిపుల్‌ఐటీ చుట్టుపక్కల అప్రకటిత కర్ఫ్యూ అమలవుతోంది. ట్రిపుల్‌ఐటీలో జరిగే విషయాలు బయటకు తెలియకుండా అధికారులు ఆదేశాలు జారీ చేశారు.

ఆందోళనలో విద్యార్థులు..

మూడు రోజుల వ్యవధిలో ఇద్దరు విద్యార్థులు మృతి చెందడంతో వర్సిటీలోని విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. తమతోపాటు చదువుకునే విద్యార్థులు తనువు చాలించడంతో ఆవేదనకు లోనవుతున్నారు. ఈనెల 13న దీపిక ఆత్మహత్యతో ఈనెల 14న వర్సిటీలో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో పాల్గొన్న లిఖిత అదే రోజు అర్ధరాత్రి భవనం పైనుంచి పడి మృతిచెందింది. అప్పటి వరకు అందరితో కలిసి ఉన్న లిఖిత మరణంతో తోటి విద్యార్థులు షాక్ అయ్యారు.

మృతదేహాన్ని చూడకుండా వెనుదిరిగిన ఇన్‌చార్జి వీసీ..



విద్యార్థిని లిఖిత మృతదేహాన్ని చూడడానికి జిల్లా ఆసుపత్రికి వచ్చిన ఇన్‌చార్జి వీసీ వెంకటరమణను విపక్ష నేతలు అడ్డుకున్నారు. మృతికి కారణాలు తెలపాలని డిమాండ్ చేశారు. బాధితులకు న్యాయం చేయాలని నినాదాలు చేశారు. దీంతో ఆయన మృతదేహాన్ని చూడకుండానే అక్కడి నుంచి వెళ్లిపోయారు.

ఫోన్‌లో పరామర్శించిన ఆర్‌ఎస్‌పీ..

బాసర ట్రిపుల్ ఐటీలో మరణించిన విద్యార్థిని లిఖిత కుటుంబ సభ్యులను బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎస్.ప్రవీణ్‌కుమార్ ఫోన్‌లో పరామర్శించారు. ఆ పార్టీ జిల్లా నాయకులు జగన్‌మోహన్, బన్సీలాల్ బాధితులతో మాట్లాడించారు. విద్యార్థిని మృతికి ప్రవీణ్‌కుమార్ విచారం వ్యక్తం చేశారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

మూడంచెల భద్రత

నిర్మల్‌చైన్‌గేట్: బాసర ట్రిపుల్‌ఐటీలో భవనం పైనుంచి పడి మృతిచెందిన లిఖితను శుక్రవారం తెల్లవారుజామున 4:05 గంటలకు నిర్మల్ జిల్లా ఆస్పత్రికి తీసుకొచ్చారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. మృతదేహం ఎవరికీ కనిపించకుండా దుప్పట్లో చుట్టి మార్చురీకి తరలించారు. విద్యార్థిని మృతి విషయం తెలుసుకున్న నాయకులు ఒక్కొక్కరుగా జిల్లా ఆసుపత్రి వద్దకు చేరుకున్నారు. లోనికి వెళ్లేందుకు యత్నించారు. ప్రతిఘటించిన పోలీసులు వారిని అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఆస్పత్రిలోకి ఎవరూ వెళ్లకుండా మార్చురీ పరిసరాలకు ఎవరూ రాకుండ డీఎస్పీ నేతృత్వంలో భద్రత ఏర్పాటు చేశారు. ఇద్దరు సీఐలు, 8 మంది ఎస్సైలు, 20 మంది కానిస్టేబుళ్లను మోహరించారు. బారికేడ్లు ఏర్పాటు చేశారు.



ఆసుపత్రి వద్ద బందోబస్తు నిర్వహిస్తున్న పోలీసులు

ఎక్కడికక్కడే అరెస్టులు..

ఆస్పత్రి వద్ద ఆందోళనకు దిగిన నేతలను పోలీసులు అరెస్ట్ చేశారు. కొందరు ఆసుపత్రి గేటు ముందు బైఠాయించగా వారిని అక్కడి నుంచి తరలించేందుకు పోలీసులు యత్నించారు. దీంతో తోపులాట జరిగింది. బీజేపీ జిల్లా కార్యదర్శి కొరిపల్లి శ్రావణ్‌రెడ్డి, అలివేలు మంగ, పెద్దపల్లి అసెంబ్లీ ఇన్‌చార్జి రావుల రాంనాథ్, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి సామా రాజేశ్వర్‌రెడ్డి, ఓబీసీ మోర్చా నాయకులు పొన్నం నారాయణగౌడ్, తోట సత్యనారాయణ, పట్టణ అధ్యక్షులు అరవింద్, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు అర్జున్, గిల్లీ విజయ్, కాంగ్రెస్ నాయకులు కూచాడి శ్రీహరిరావు, కొంతం గణేష్, గాజుల రవిని పోలీసులు అరెస్ట్ చేశారు.

బీజేపీ నేతల ఆందోళన..

ట్రిపుల్ ఐటీలో వరుస మరణాలపై బీజేపీ నాయకులు వర్సిటీ వద్ద ఆందోళన చేయడానికి యత్నించా రు. పార్టీ జిల్లా అధ్యక్షురాలు రమాదేవి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రామారావు పటేల్‌తోపాటు విద్యార్థి, ప్రజాసంఘాల నాయకులు చేరుకున్నారు. అప్పటికే మోహరించిన పోలీసు బలగాలు వారిని అదుపులోకి తీసుకున్నాయి. మరోవైపు మరణాలపై అధికారులు పొంతన లేకుండా మాట్లాడడంపై నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థినుల కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని, మృతుల కుటుంబాల్లో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని రామారావు పటేల్ డిమాండ్ చే శారు. విద్యార్థుల మృతిపై సమగ్ర విచారణ జరిపించాలని పలువురు డిమాండ్ చేశారు.

దివ్యాంగులకు మరింత ధీమా



దివ్యాంగుల సమక్షంలో కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి

- పింఛన్ మరో రూ.1000 పెంపు
- స్వయంగా ప్రకటించిన సీఎం కేసీఆర్
- హర్షం వ్యక్తం చేస్తున్న దివ్యాంగులు
- జిల్లాలో 10,740 మందికి లబ్ధి

లక్ష్మణచాంద: రాష్ట్రంలోని అన్నివర్గాల అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది. స్వరాష్ట్రం ఏర్పడిన తరువాత సీఎం కేసీఆర్ అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి అమలు చేస్తున్నారు. ఆసరా పథకం కింద వృద్ధులు, ఒంటరి మహిళలు, వితంతువులు, దివ్యాంగులు, నేత, గీత, బీడీ కార్మికులకు పింఛన్లు ఇస్తున్నారు. గతంలో వందల్లో ఉన్న పింఛన్‌ను కేసీఆర్ వేలకు పెంచారు.

గతంలో అరకొర....

గతంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో దివ్యాంగులకు నెలకు కేవలం రూ.70 పింఛన్ మాత్రమే ఇచ్చేది. ఇది దివ్యాంగులకు ఏ మాత్రం సరిపోయేది కాదు. దీంతో దివ్యాంగులు తమ కుటుంబ సభ్యులపైనే అన్నింటికి ఆధారపడేవారు. వైఎస్.రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక ఈ పింఛన్‌ను రూ.200 పెంచారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడే వరకూ ఇదే పింఛన్ అందించారు.

స్వరాష్ట్రంలో భారీగా పెంపు..

స్వరాష్ట్రం సిద్ధించిన తరువాత ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన సీఎం కేసీఆర్ నేటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు, వివిధ కుల వృత్తుల వారికి ఇచ్చే పింఛన్లను రూ.1,016కు పెంచారు. ఇక దివ్యాంగుల పింఛన్‌ను రూ.2016కు పెంచారు. 2018 అసెంబ్లీ ఎన్నికల సమయంలో బీఆర్‌ఎస్‌ను గెలిపిస్తే ఆసరా పింఛన్‌ను రూ.1000 పెంచుతామని హామీ ఇచ్చారు. ఈమేరకు బీఆర్‌ఎస్ మళ్లీ అధికారంలోకి రావడంతో ఇచ్చిన హామీ ప్రకారం వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు, కుల వృత్తుల వారికి ఇచ్చే పింఛన్‌ను రూ.1,016 నుంచి రూ.2016కు పెంచారు. దివ్యాంగుల పింఛన్‌ను రూ.2016 నుంచి రూ.3,016కు పెంచారు. దీంతో దివ్యాంగులు ఇతరులపై ఆధారపడకుండా వారి అవసరాలను వారే తీర్చుకుంటున్నారు.

దివ్యాంగులకు మంచి రోజులు..



ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో దివ్యాంగులకు సరిగా పింఛన్ ఇవ్వలేదు. ఇచ్చిన పింఛన్ కూడా రూ.200 మించలేదు. తెలంగాణ సాధించుకున్న తర్వాత దివ్యాంగులకు మంచిరోజులు వచ్చాయి. సీఎం కేసీఆర్ మొదట రూ.2,016, తర్వాత రూ.3,016 చేశారు. తాజాగా మరో వెయ్యి కలిపి ఇస్తామని ప్రకటించారు. దీంతో పింఛన్ రూ.4,016 అయింది.

– క్రాంతికుమార్, దివ్యాంగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

మరో రూ.1000 పెంపు..

ఇటీవల మంచిర్యాల జిల్లా పర్యటనకు వచ్చిన ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు నూతన సమీకృత భవనం ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన బహిరంగ సభలో మాట్లాడుతూ దివ్యాంగుల పింఛన్‌ను మరో రూ.1000 పెంచుతున్నట్లు ప్రకటించారు. జూలై నుంచి పెంచిన పింఛన్ ఇస్తామని కూడా ప్రకటించారు. దీంతో దివ్యాంగులకు జూలై నుంచి పింఛన్ రూ.4,016 అందనుంది. సీఎం ప్రకటనతో దివ్యాంగులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

జిల్లాలో 10,740 మందికి లబ్ధి..

నిర్మల్ జిల్లాలోని 10,740 మంది దివ్యాంగులకు లబ్ధి చేకూరనుంది. దివ్యాంగులకు ఇస్తున్న పింఛన్‌ను రూ.3,016 నుంచి రూ.4,016 పెంచుతున్నట్లు ప్రకటించడంతో జిల్లాలోని దివ్యాంగులు ఇటీవల సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు.

గ్రామ స్వరాజ్యం దిశగా పల్లెలు



మాట్లాడుతున్న మంత్రి మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, పక్కన కలెక్టర్ వరుణ్‌రెడ్డి

- మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి

నిర్మల్ రూరల్: ముఖ్యమంత్రి కేసీఆర్ చొరవతో తెలంగాణ పల్లెలు గ్రామ స్వరాజ్యం దిశగా పయనిస్తున్నాయని మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. ఇందులో తాము భాగస్వాములం అయినందుకు సంతోషంగా ఉందని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా నిర్మల్ మండలం భాగ్యనగర్ గ్రామంలో గురువారం పల్లె ప్రగతి దినోత్సవం నిర్వహించారు. కలెక్టర్ వరుణ్‌రెడ్డితో కలిసి మంత్రి నూతన గ్రామపంచాయతీ భవనాన్ని ప్రారంభించారు. జాతీయ జెండా ఆవిష్కరించి జాతీయ గీతం ఆలపించారు. గ్రామంలోని పారిశుధ్య కార్మికులను సన్మానించారు. అనంతరం ఐకే రెడ్డి మాట్లాడారు. పల్లె ప్రగతి కార్యక్రమం చేపట్టిన తర్వాత గ్రామాల రూపురేఖలు మారాయని తెలిపారు. పల్లెలు బాగుంటేనే దేశం బాగుంటుందన్నారు. ప్రతీ గ్రామంలో వైకుంఠధామం, హరితవనం, నర్సరీ, క్రీడా ప్రాంగణం, ట్రాక్టర్ ట్రాలీ తదితర ఎన్నో సౌకర్యాలను సమకూర్చామన్నారు. భూముల రేట్లు పెరుగుతున్నాయని రైతులు భూములను అమ్ముకోవద్దని సూచించారు. దేశంలో రైతులకు కష్టం లేని రాష్ట్రం తెలంగాణ ఒక్కటే అని స్పష్టం చేశారు. కలెక్టర్ వరుణ్‌రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాకముందు ప్రతీ గ్రామంలో మంచినీరు, కరెంట్ సమస్య ఉండేదన్నారు. ఇప్పుడు ఆ బాధ తీరిందని తెలిపారు. రాష్ట్రం ఏర్పడక ముందు పరిస్థితులు ఎలా ఉండేవో ప్రస్తుత పరిస్థితులు ఎలా ఉన్నాయో బేరీజు వేసుకోవాలన్నారు. వేడుకల్లో డీపీవో శ్రీలత, తహసీల్దార్ ప్రభాకర్, ఎంపీడీవో సాయిరాం, ఎంపీపీ రామేశ్వర్‌రెడ్డి, సర్పంచ్ కారగిరి భూమయ్య, ఉపసర్పంచ్ రాజేందర్, నాయకులు మహేశ్‌రెడ్డి, రామ్‌కిషన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



బతుకమ్మ ఆడుతున్న మంత్రి ,కలెక్టర్

గెలుపే లక్ష్యంగా పనిచేయాలి



మాట్లాడుతున్న పల్లె గంగారెడ్డి

నిర్మల్‌చైన్‌గేట్: వచ్చే ఎన్నికల్లో బీజేపీని అధికారంలోకి తీసుకురావడమే లక్ష్యంగా ప్రతీ కార్యకర్త పనిచేయాలని పార్టీ రాష్ట్ర కార్యదర్శి పల్లె గంగారెడ్డి సూచించారు. సంయుక్త మోర్చా మహా సమ్మేళన్ (అన్ని మోర్చాల సమావేశం) అసెంబ్లీ కన్వీనర్ నాయుడు మురళి అధ్యక్షతన మహేశ్వర్ రెడ్డి క్యాంపు కార్యాలయంలో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తొమ్మిదేళ్ల బీజేపీ పాలనలో చేసిన అభివృద్ధిని ప్రజలకు వివరించడమే మహాజన సంపర్క్ అభియాన్ ముఖ్య ఉద్దేశమన్నారు. ప్రధానిగా మోదీ సాధించిన విజయాలు, పేదల కోసం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. తెలంగాణాలో బీజేపీని అధికారంలోకి తీసుకురావడంలో మోర్చాలు ప్రధాన పాత్ర వహించాలన్నారు. పార్లమెంట్ కన్వీనర్ అయ్యన్నగారి భూమయ్య, పెద్దపల్లి జిల్లా ఇన్‌చార్జి రావుల రామనాథ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డాక్టర్ మల్లికార్జున్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి సామ రాజేశ్వర్‌రెడ్డి, మేడిసమ్మె రాజు, దళిత మోర్చా జిల్లా అధ్యక్షుడు రాచకొండ సాగర్, యువ మోర్చా జిల్లా అధ్యక్షుడు వోడిసెల అర్జున్, మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు రజిని వైద్య, దళిత మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడ నరేందర్, బీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నారాయణగౌడ్, బీజేవైఎం స్టడీ సర్కిల్ రాష్ట్ర కన్వీనర్ కుమ్మరి వెంకటేశ్, జిల్లా కార్యదర్శి మిట్టపల్లి రాజేందర్, నాయకులు పాల్గొన్నారు.

సీఎం స్వనిధిలో భైంసా టాప్

భైంసాటౌన్: కరోనా సమయంలో జీవనోపాధి కోల్పోయి ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొన్న వీధి, చిరు వ్యాపారులకు సీఎం స్వనిధి కింద కేంద్రం రూ.10 వేల చొప్పున రుణాలు అందించింది. రుణం చెల్లించినవారికి తర్వాత రూ.20 వేలు, అవి కూడా చెల్లించిన వ్యాపారులకు రూ.50 వేల వరకు రుణాలు ఇచ్చారు. ఇలా వీధి వ్యాపారులకు రుణాలు ఇచ్చిన మున్సిపాలిటీల్లో భైంసా రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలిచింది. 50 వేల లోపు జనాభా కలిగిన మున్సిపాలిటీల్లో భైంసా అగ్రస్థానంలో ఉండడంతో తెలంగాణ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా హైదరాబాద్‌లోని శిల్పకళావేదికలో అవార్డు ప్రదానం చేయనున్నారు. భైంసా మున్సిపాలిటీలో మొదటి విడతలో 2,650 మంది వీధి వ్యాపారులకు రూ.10 వేల రుణం అందించగా, వీటిని సకాలంలో చెల్లించిన 1,360 మందికి రెండోవిడతలో రూ.20 వేల రుణం ఇచ్చారు.

ఎయిడ్స్ రహిత సమాజం నిర్మిద్దాం



బ్లడ్ శాంపిల్ సేకరిస్తున్న, రవీందర్‌రెడ్డి

లక్ష్మణచాంద: ఎయిడ్స్ రహిత సమాజాన్ని నిర్మించడం కోసం అందరూ కృషి చేయాలని ఎయిడ్స్ కంట్రోల్ ఇండియా పీవో డాక్టర్ రవీందర్‌రెడ్డి కోరారు. మండలంలోని వడ్యాల్ తాండాలో ఎయిడ్స్ కంట్రోల్ ఇండియా ఆధ్వర్యంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. గ్రామానికి చెందిన 85 మంది నుంచి రక్త నమూనాలు సేకరించారు. ఈ సందర్భంగా ఎయిడ్స్‌పై అవగాహన కల్పించారు. సూచనలు చేశారు. సర్పంచ్ పూలవతి, ఉప సర్పంచ్ వెంకటేశ్, డీఎస్ఆర్‌సీ శ్రీనివాస్, ల్యాబ్ టెక్నీషియన్ రమేశ్‌రెడ్డి, ఏఎన్‌ఎం భూలక్ష్మి, గ్రామీణ్ సఫోర్ట్ ఫౌండేషన్ జిల్లా మేనేజర్ శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి హైమావతి పాల్గొన్నారు.

‘ఎల్‌ఎల్‌ఎం’లో ఖానాపూర్ వాసికి 135వ ర్యాంకు



నరేంద్రనాథ్

ఖానాపూర్: తెలంగాణ యూనివర్సిటీలో ఎల్‌ఎల్‌బీ ఫైనల్ ఇయర్ చదువుతున్న పట్టణంలోని విద్యానగర్ కాలనీకి చెందిన నరేంద్రనాథ్ ఎల్‌ఎల్‌ఎం ఎంట్రన్స్‌లో సత్తా చాటాడు. గురువారం విడుదల చేసిన ఫలితాల్లో 135వ ర్యాంకు సాధించాడు. నరేంద్రనాథ్‌ను న్యాయ కళాశాల ప్రిన్సిపాల్ ప్రసన్నరాణి, ప్రొఫెసర్లు స్రవంతి, యెల్లోషా అభినందించారు.

క్లుప్తంగా

ముఖరా(కే) పంచాయతీకి ఐఎస్వో సర్టిఫికెట్



సర్పంచ్ మీనాక్షికి సర్టిఫికెట్ ఇస్తున్న మంత్రి దయాకర్‌రావు

ఇచ్చోడ: ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ మండలం ముఖరా(కే) పంచాయతీ సర్పంచ్ గాడ్గే మీనాక్షికి పంచాయతీరాజ్‌శాఖ మంత్రి ఎర్రబెల్లి దయకర్‌రావు గురువారం హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో ఐఎస్వో సర్టిఫికెట్ అందజేశారు. తెలంగాణ పల్లెప్రగతి దినోత్సవం సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆమెను అభినందించారు. రాష్ట్ర అభివృద్ధిలో ముఖరా (కే) రాష్ట్రానికే ముఖచిత్రంగా నిలుస్తుందని మంత్రి పేర్కొన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ముఖ్యకార్యదర్శి శాంతకుమారి, ముఖరా(బీ) ఎంపీటీసీ గాడ్గే సూభాష్ పాల్గొన్నారు.

తునికాకు అక్రమంగా తరలిస్తున్న ఆటోల పట్టివేత

బోథ్: మండలంలోని నిగిని గ్రామం నుంచి బోథ్ మండల కేంద్రానికి తూనికాకు తరలిస్తున్న రెండు ఆటోలను గురువారం పట్టుకున్నట్లు బోథ్ అటవీ శాఖ రేంజ్ అధికారి తొడిశెట్టి ప్రణయ్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. నిగిని గ్రామం నుంచి రెండు ఆటోల్లో రాథోడ్ సోఫాన్, రాథోడ్ కిరణ్‌లు తూనికాకును బోథ్ మండల కేంద్రానికి తరలిస్తుండగా పట్టుకుని స్థానిక అటవీ శాఖ కార్యాలయానికి తరలించారు. తూనికాకు విలువ దాదాపు రూ.2లక్షల వరకు ఉంటుందని ఆయన తెలిపారు. అక్రమంగా తూనికాకు తరలింపు వెనుక మరికొంత మంది హస్తం ఉన్నట్లు పేర్కొన్నారు. విచారణ చేసిన తరువాత కేసు నమోదు చేస్తామని వెల్లడించారు.

జిల్లా క్రికెటర్ ట్రిపుల్ సెంచరీ

ఆదిలాబాద్: జిల్లాకు చెందిన క్రికెటర్ కొడిమెల హిమ తేజ ట్రిపుల్ సెంచరీ సాధించాడు. హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న లీగ్ మ్యాచుల్లో భారత్ డైనమిక్స్ లిమిటెడ్ తరఫున హిమ తేజ ప్రాతినిధ్యం వహిస్తున్నాడు. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా జట్టుతో జరుగుతున్న ఈ టెస్ట్ మ్యాచ్లో ఎస్‌బీఐ జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 10 వికెట్ల నష్టానికి 405 పరుగులు చేసింది. మొదటి ఇన్నింగ్స్‌లో రెండవ రోజు 150పరుగులతో అజేయంగా నిలిచిన హిమ తేజ, మూడవరోజు 319 పరుగులతో ట్రిపుల్ సెంచరీ చేశాడు. దీంతో జిల్లాకు చెందిన పలువురు క్రికెటర్లు హిమ తేజను అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

లక్సెట్టిపేట(మంచిర్యాల): రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై లక్ష్మణ్ తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని చందారం గ్రామానికి చెందిన ఉపేందర్ (28) గురువారం ద్విచక్ర వాహనంపై లక్సెట్టిపేటకు వెళ్తుండగా ఎదురుగా వచ్చిన బైక్ ఢీకొట్టడంతో తీవ్రగాయాలయ్యాయి. గమనించిన స్థానికులు స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతుండగా పరిస్థితి విషమించడంతో మృతి చెందాడు. కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

హలో నేను.. ఎమ్మార్వో ఆఫీస్ నుంచి...



మహిళకు పంపిన వాట్సాప్ మేసేజ్‌లు



అటెండర్‌కు దేహశుద్ధి చేస్తున్న మహిళలు

- ఫోన్ లిఫ్ట్ చేయకపోతే ఇప్పుడే ఇన్‌కమ్ సర్టిఫికెట్ రిజెక్ట్ చేస్తా
- ఓ మహిళతో ఫోన్‌లో అసభ్యకరమైన వాయిస్ రికార్డింగ్
- నేరడిగొండ తహసీల్దార్ కార్యాలయ అటెండర్‌కు దేహశుద్ధి

నేరడిగొండ: హలో నేను నీ ఇన్‌కమ్ సర్టిఫికెట్ కొట్టిన కదా ఎమ్మార్వో ఆఫీస్ నుంచి.. తిన్నవా అని అడిగినా సప్పుడే చేస్తలేవు.. నీ భర్త ఫారెన్ వెళ్లాడు కదా.. నా ఫ్రెండే అతను ఆల్‌రెడీ.. మీరు ఏమనుకుంటున్నారు.. ఇప్పుడంటే ఇప్పుడే నీ సర్టిఫికెట్ రిజెక్ట్ చేసేస్తాను.. నేను ఏదిచేయాలో అది చేస్తాను నా చేతిలో ఉంటదది.. అంటూ జూనియర్ అసిస్టెంట్ పేరు చెప్పి నేరడిగొండ తహసీల్దార్ కార్యాలయానికి చెందిన అటెండర్ అశోక్ ఓ మహిళ ఫోన్‌కు అసభ్యకరమైన రికార్డింగ్‌లు పంపించాడు.

అటెండర్‌కు దేహశుద్ధి...

అటెండర్ అశోక్‌కు గురువారం గ్రామస్తులు, మహిళలు దేహశుద్ధి చేశారు. ఆదాయ ధ్రువీకరణ పత్రం కోసం కార్యాలయానికి వచ్చిన ఓ మహిళ ఫోన్ నంబర్‌ను దరఖాస్తు నుంచి తీసుకొని ఓ అధికారి పేరిట సదరు మహిళ ఫోన్‌కు అసభ్యకరమైన రికార్డింగ్‌లు పంపించాడు. తనతో మాట్లాడితేనే సర్టిఫికెట్ అప్రూవ్ అవుతుందని పేర్కొన్నాడు. ఈ విషయాన్ని బాధిత మహిళ గ్రామస్తులకు తెలియజేయడంతో వారు కార్యాలయానికి చేరుకున్నారు. అక్కడ ఉన్న అటెండర్‌ను గ్రామస్తులు, మహిళలు చితకబాదారు. ఆయా పనుల నిమిత్తం కార్యాలయానికి వచ్చే మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించడంపై మండిపడ్డారు. రోజురోజుకు మహిళలకు రక్షణ లేకుండా పోతోందని వాపోయారు. అనంతరం ఆ అటెండర్‌ను పోలీసులకు అప్పగించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సాయన్న తెలిపారు. ఈవిషయమై తహసీల్దార్ పవన్‌చంద్రను వివరణ కోరగా ఉన్నతాధికారులకు నివేదించనున్నట్లు పేర్కొన్నారు.

అంతరిక్ష విజ్ఞానంపై శిక్షణ

- ఉపాధ్యాయులు, అధ్యాపకులకు అవకాశం
- ఆన్‌లైన్ దరఖాస్తుకు నేడే ఆఖరి గడువు

భైంసాటౌన్: ఇస్రో ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు, అధ్యాపకులకు ఏటా అంతరిక్ష విజ్ఞానంపై శిక్షణ అందిస్తోంది. ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ రిమోట్ సెన్సింగ్ తరఫున వేసవి సెలవుల్లో ఆన్‌లైన్ మాధ్యమంగా ఈ శిక్షణ అందిస్తోంది. 9 నుంచి 12వ తరగతులకు భౌతిక, రసాయన, జీవ, గణితశాస్త్రం బోధించే ఉపాధ్యాయులు, అధ్యాపకులు ఈ శిక్షణకు దరఖాస్తు చేసుకోవచ్చు. ఈనెల 16తో దరఖాస్తు గడువు ముగియనుంది. ఐదు రోజులపాటు కొనసాగే కోర్సు పూర్తి చేసుకున్నవారికి ప్రశ్నాపత్రం ఉంటుంది. ఇందులో ప్రతిభ కనబరిచిన వారికి ధ్రువపత్రాలు అందిస్తారు. ఆసక్తిగల ఉపాధ్యాయులు ఈ సదావకాశాన్ని సద్వినియోగం చేసుకోవచ్చు. తద్వారా విద్యార్థులకు అంతరిక్ష విజ్ఞానంపై అవగాహన కల్పించవచ్చు.

ఎవరు దరఖాస్తు చేసుకోవచ్చంటే...

ఇస్రో ఆధ్వర్యంలో అంతరిక్ష విజ్ఞానంపై శిక్షణ అందిస్తోంది. ఏటా కాలానుగుణంగా వివిధ అంశాలపై శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు. ఈ శిక్షణకు ప్రభుత్వ పాఠశాలలు, విద్యాసంస్థల్లో బోధించే ఉపాధ్యాయులు దరఖాస్తు చేసుకోవచ్చు. డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఐఐఆర్ఎస్.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్‌లో వివరాలతో నమోదు చేసుకోవాలి. ఈ నెల 19 నుంచి 23 వరకు ఐదు రోజుల పాటు శిక్షణ ఉంటుంది. జిల్లా నుంచి ఏటా పలువురు ఉపాధ్యాయులు ఈ ఆన్‌లైన్ శిక్షణను సద్వినియోగం చేసుకుంటున్నారు. ఈసారి సైతం ఉపాధ్యాయులు శిక్షణకు దరఖాస్తు చేసుకోనున్నారు.

సద్వినియోగం చేసుకోవాలి..

ఇస్రో ఆధ్వర్యంలో ఏటా ఆన్‌లైన్ శిక్షణ అందిస్తోంది. అంతరిక్ష విజ్ఞానంపై ఐదురోజుల కోర్సు ఉంటుంది. ఉపాధ్యాయులు, అధ్యాపకులు ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలి. అంతరిక్ష విజ్ఞానంపై అవగాహన పెంచుకునేందుకు శిక్షణ దోహదపడనుంది. **వినోద్, జిల్లా సైన్స్ అధికారి, నిర్మల్**

లోపభూయిష్టంగా సదర్మాట్ గైడ్‌వాల్ పనులు

- టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెడ్మ బొజ్జు



కాలువ గైడ్‌వాల్ పనులు పరిశీలిస్తున్న బొజ్జు



మట్టి ఇసుకను చూపుతున్న నాయకులు

ఖానాపూర్: ఖానాపూర్, కడెం మండలాల రైతుల జీవనాధారమైన సదర్మాట్ పనుల్లో ప్రభుత్వ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెడ్మ బొజ్జు అన్నారు. ఖానాపూర్ మండలంలోని మేడంపల్లి గ్రామంలోని సదర్మాట్ ఆనకట్ట వద్ద జరుగుతున్న గైడ్‌వాల్ మరమ్మతు పనులను పరిశీలించారు. సుమారు రూ.2కోట్లతో చేపడుతున్న ఈ పనులు పూర్తిగా నాణ్యతా లోపంతో సాగుతున్నాయన్నారు. సంబంధిత అధికారుల పర్యవేక్షణ కొరవడి తూతూ మంత్రంగా సాగుతోందని వివరించారు. గైడ్‌వాల్ మరమ్మతుల కోసం ఉపయోగించే ఇసుక సగం మట్టితో ఉందన్నారు. కేవలం ఎమ్మెల్యేకు కమీషన్‌లు ఇవ్వాల్సి ఉండడంతోనే పనులు సక్రమంగా చేయడం లేదని ఆరోపించారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ఆర్ హయాంలో ఈ ప్రాంత రైతుల చిరకాల కోరికను దృష్టిలో ఉంచుకుని అప్పట్లో రూ.305కోట్లు మంజూరు చేశారని తెలిపారు. గైడ్‌వాల్, కాలువ పనుల్లో నాణ్యతాలోపంపై కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో త్వరలో చలో సదర్మాట్ కార్యక్రమం చేపడతామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ గుగ్లావత్ రాజునాయక్, పార్టీ మండలాధ్యక్షుడు దయానంద్, పట్టణాధ్యక్షుడు నిమ్మల రమేష్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కదార్ల గంగనర్సయ్య, మాజీ వైస్ ఎంపీపీ తోట సత్యం, నాయకులు వాజిద్‌ఖాన్, ముస్కు రాజు ఉన్నారు.

ద్విచక్ర వాహనం అదుపు తప్పి ఒకరికి గాయాలు



గాయాలపాలైన అనిల్

భైంసారూరల్: మండలంలోని మాంజ్రి గ్రామ సమీపంలో ద్విచక్ర వాహనం అదుపుతప్పి అనిల్ అనే వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల వివరాల ప్రకారం... తానూరు మండలంలోని బోంద్రట్ గ్రామానికి చెందిన అనిల్ గురువారం బైక్‌పై భైంసాకు వచ్చాడు. తిరుగు ప్రయాణంలో మాంజ్రి గ్రామ సమీపంలో ద్విచక్రవాహనం అదుపు తప్పి కిందపడిపోయాడు. గమనించిన స్థానికులు చికిత్స నిమిత్తం 108 అంబులెన్సులో భైంసా ఏరియా ఆస్పత్రికి తరలించారు.

మురుగుకాల్వలో పడి వృద్ధుడి మృతి

లక్ష్మణచాంద: ప్రమాదవశాత్తు మురుగుకాలువలో పడి వృద్ధుడు మృతి చెందిన సంఘటన మండల కేంద్రంలో గురువారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే... మండల కేంద్రానికి చెందిన ఎర్రవోయిన పోతన్న(79) కొంతకాలంగా తహసీల్దార్ కార్యాలయ సమీపంలోని రోడ్డు పక్కనే ఓ గుడిసెలో నివాసముంటున్నాడు. గతంలో భార్య పిల్లలను తీసుకుని వెళ్లిపోయింది. దీంతో అతడు అప్పటి నుంచి పూరిగుడిసెలో ఒంటరిగా జీవిస్తున్నాడు. గురువారం మధ్యాహ్నం సమయంలో పూరిగుడిసె వద్ద చెట్టు నీడకు వెళ్లే క్రమంలో పక్కనే గల మురుగుకాలువలో జారిపడి మృతి చెందాడు. అటువైపుగా వెళ్లిన వాళ్లు చూసి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఎస్సై రాహుల్ గైక్వాడ్ సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. అల్లుడు రమేష్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పురుగుల మందుతాగి ఒకరి ఆత్మహత్య

భైంసారూరల్: మండలంలోని టాక్లి గ్రామానికి చెందిన మోతె మారుతి(45) గురువారం పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం... మారుతి వ్యవసాయ కూలీగా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. బుధవారం రాత్రి మద్యం మత్తులో ఇంటి ముందు పడుకున్నాడు. కుటుంబీకులు ఉదయం లేచి చూడగా మృతిచెంది ఉన్నాడు. మృతుడికి భార్యతో పాటు ముగ్గురు పిల్లలు ఉన్నారు. తండ్రి గంగారాం ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు.

ఉరేసుకుని ఒకరి ఆత్మహత్య

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని ఇంద్రానగర్‌కు చెందిన బానావత్ రమేష్ (33) చాతినొప్పి తాళలేక గురువారం ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు రెండుటౌన్ ఎస్సై ఊశన్న తెలిపారు. ఆటో నడుపుతూ జీవనం సాగించే మృతుడు నెలరోజుల క్రితం చాతినొప్పికి ఆస్పత్రిలో చికిత్స పొందాడు. నొప్పి తగ్గడం లేదనే బాధతో గురువారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరులేని సమయంలో దులానికి ఉరేసుకున్నాడు. ఆ సమయంలో ఇంటికి వచ్చిన మృతుడి మరదలు పిలిచిన తలుపు తీయకపోవడంతో మృతుడి భార్య లక్ష్మికి సమాచారమందించింది. వారు తలుపులు తెరిచి చూడగా దులానికి వేలాడుతు కన్పించాడు. చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లుగా వైద్యులు తెలిపారన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

యువతి అదృశ్యం

సారంగపూర్: మండలంలోని కొట్ల(బి) గ్రామంలోని శాంతినగర్ కాలనీకి చెందిన జాదవ్ సంగీత (20) గురువారం అదృశ్యమైనట్లు వచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నామని ఎస్సై కృష్ణాసాగర్‌రెడ్డి తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. శాంతినగర్ కాలనీకి చెందిన జాదవ్ బాబ్యు కుమార్తె సంగీత గురువారం ఉదయం 8గంటలకు కొట్ల(బి) గ్రామంలోని మీసేవా కేంద్రానికి వెళ్లింది. తెలిసిన వారి ఇళ్లల్లో వెతికినా ఆచూకీ కానరాలేదు. దీంతో స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

హత్యాయత్నానికి పాల్పడిన ఇద్దరి అరెస్టు

కుంటాల: మండలంలోని పెంచికల్‌పాడ్ గ్రామంలో భూ తగాదాల విషయంలో తండ్రి కొడుకులపై హత్యాయత్నానికి పాల్పడిన ఇద్దరు నిందితులను గురువారం అరెస్టు చేసినట్లు ఎస్సై హన్మండ్లు పేర్కొన్నారు. ఎస్సై వివరాల ప్రకారం... మండలంలో ఈ నెల 10న పెంచికల్‌పాడ్ గ్రామానికి చెందిన సూర్యవంశీ పాండురంగ్, అంబాదాస్ తండ్రి కొడుకులపై ఆకాష్, సూర్యవంశీ ఆనంద్‌రావులతో పాటు మరో నలుగురు కర్రలు, గొడ్డళ్లతో దాడి చేయగా తీవ్ర గాయాలయ్యాయి. అంబాదాస్ భార్య రేణుక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు ఆకాష్, ఆనంద్‌రావులను మండలంలోని కల్లూరులో అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రెండు కర్రలు, గొడ్డలిని స్వాధీనం చేసుకున్నారు. అనంతరం భైంసా కోర్టులోని మెజిస్ట్రేట్ ఎదుట హాజరుపరిచారు. మిగతా నలుగురు నిందితులు పరారీలో ఉన్నారని, వారి కోసం గాలింపు చర్యలు చేపట్టినట్లు ఎస్సై వెల్లడించారు.

తాతను కలిసేందుకు వెళ్లి...

- రోడ్డు ప్రమాదంలో బాలుడి మృతి..
- పంక్చర్ అయిన మహారాష్ట్ర బస్సు
- ఆటోలో వెళ్తుండగా దుర్ఘటన



బాల్‌రాజ్ మృతదేహం



బోల్తాపడిన ఆటో

భైంసారూరల్: భైంసా పట్టణానికి చెందిన బాలుడు గురువారం కుభీర్ మండలం పల్సి గ్రామంలోని తాత వద్దకు వెళ్తుండగా రోడ్డు ప్రమాదం రూపంలో మృత్యువు కబళించింది. స్థానికుల వివరాల ప్రకారం... మమత – నాగ్‌నాథ్ దంపతులది పల్సి గ్రామం. నాగ్‌నాథ్ ఆర్మీలో ఉద్యోగం చేస్తున్నాడు. తన ఇద్దరు కొడుకులను పట్టణంలోని రాహుల్‌నగర్‌లో ఉంటూ అక్కడే చదివిస్తున్నాడు. గురువారం తల్లి మమత కుమారుడు బాల్‌రాజ్(12)ను భైంసా బస్టాండ్‌కు వచ్చి మహారాష్ట్ర డిపోకు చెందిన కిని బస్సులో ఎక్కించింది. పట్టణ సమీపంలోనే బస్సు టైరు పంక్చర్ కావడంతో ఆటోలో ఎక్కాడు. లింగా గ్రామం సమీపంలోని మూలమలుపు వద్ద ఆటో అదుపుతప్పి బోల్తాపడగా బాల్‌రాజ్ అక్కడికక్కడే మృతిచెందాడు. అందులో ప్రయాణిస్తున్న భోజమ్మ(బాసర), ఆనందబాయి(సుంక్లి), భూమ(భైంసా), చిన్నాబాయి(మహాలింగి)లకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులంతా మహారాష్ట్రలోని కిని గ్రామంలో అంత్యక్రియలకు వెళ్తున్నారు. వీరితోపాటు మరో నలుగురికి స్వల్ప గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న బాధితుల కుటుంబీకులంతా భైంసా ఏరియా ఆసుపత్రికి చేరుకుని బోరున విలపించారు. భైంసారూరల్ ఎస్సై శ్రీకాంత్ సంఘటనా స్థలానికి చేరుకుని రోడ్డు ప్రమాదానికి గల కారణాలు తెలుసుకున్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

బండెక్కిన అభిమానం



పాన్ ఇండియా స్టార్ ప్రభాస్, ఓంరౌత్ దర్శకత్వంలో తెరకెక్కిన ఆదిపురుష్ చిత్రం శుక్రవారం విడుదల కానుంది. ఆదిలాబాద్ పట్టణం రవీంద్రనగర్‌కు చెందిన బ్యూటీ పార్లర్ నిర్వహించే స్వప్న ప్రభాస్‌కు వీరాభిమాని. ఆమె ఆరాధ్య దైవం రాముడు పాత్రలో ప్రభాస్ నటించిన ఆ చిత్రాలతో కూడిన స్టిక్కర్లను తన స్కూటీపై అంటించుకుంది. దీన్ని చూసిన ప్రజలు ప్రభాస్‌పై ఆమెకున్న అభిమానానికి ఫిదా అవుతున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్.

అటవీహక్కు పత్రాలు ఇవ్వకుండా మోసం



కరపత్రం అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఆదిలాబాద్‌రూరల్: ఆదివాసీలు ఏళ్లుగా సాగు చేస్తున్న పోడు భూములకు హక్కు పత్రాలు ఇవ్వకుండా బీఆర్ఎస్ మరోసారి మోసం చేసే ప్రయత్నం చేస్తోందని డీసీసీ అధ్యక్షుడు సాజిద్‌ఖాన్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి గండ్రత్ సుజాత ఆరోపించారు. గడపగడపకూ కాంగ్రెస్ కార్యక్రమంలో భాగంగా గురువారం ఆదిలాబాద్ రూరల్ మండలం చిన్నలోకారి, పెద్దలోకారి గ్రామాల్లో పర్యటించారు. ఇంటింటికీ తిరుగుతూ కాంగ్రెస్ అధికారంలోకి వస్తే అమలు చేసే పథకాలపై వివరించారు. వారు మాట్లాడుతూ.. డబుల్ బెడ్రూం ఇళ్లు, రుణమాఫీ తదితర హామీలు బీఆర్ఎస్ ప్రభుత్వం నెరవేర్చలేదని విమర్శించారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రైతులకు రూ.2లక్షల రుణమాఫీ, ప్రతి ఒక్కరికీ రూ.5లక్షలతో ఇందిరమ్మ ఇల్లు నిర్మించి ఇస్తామని చెప్పారు. ఏఎంసీ మాజీ చైర్మన్ అల్లూరి సంజీవ్‌రెడ్డి, పార్టీ మండలాధ్యక్షుడు సంజయ్ దుబే, నాయకులు సంతోష్, రవి, మోతీరాం, సాధిక్ తదితరులున్నారు.

రేషన్ బియ్యం పట్టివేత



రేషన్ బియ్యాన్ని తరలిస్తున్న మాక్స్ ఇదే

నార్నూర్: మండలంలోని ఎస్సీ వసతి గృహం వద్ద గురువారం అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని ఎస్సై రవికిరణ్ పట్టుకున్నారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన తోకిర్‌ఖాన్ అనే యువకుడు మాక్స్ వాహనంలో ఐదు క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని నార్నూర్ నుంచి ఉట్నూర్‌కు తరలిస్తుండగా మార్గమధ్యంలో ఎస్సీ వసతి గృహం వద్ద పట్టుకున్నారు. వాటిని ఎన్‌ఫోర్స్‌మెంట్ డెప్యూటీ తహసీల్దార్ మధుసూదన్‌కు అప్పగించినట్లు తెలిపారు. పంచనామా నిర్వహించి మండల కేంద్రంలోని డీఆర్‌డీపోకు తరలించారు. కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.



అనుక్షణం.. ఉత్కంఠ





బాసర ట్రిపుల్ ఐటీ విద్యార్థిని బూర లిఖిత మృతిచెందిన విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు ఆస్పత్రికి చేరుకుని విలపించారు. పలు పార్టీల నాయకులు నిర్మల్ జిల్లా ఆస్పత్రికి చేరుకుని లోపలికి చొచ్చుకుని వెళ్లేందుకు యత్నించారు. ప్రతిఘటించిన పోలీసులు వారిని అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. దీంతో ట్రిపుల్ ఐటీ, జిల్లా ఆస్పత్రి వద్ద ఉద్రిక్త వాతావరణం నెలకొంది.

